# గలగల

గలగలమనే చప్పుడు ఆగిపోయింది. మోటారు చప్పుడూ ఆగిపోయింది. మోరడెత్తు మోసులున్న చెరుకు తోట మధ్యలో చేతిలో పార పట్టుకొని వున్న నడివయసు స్త్రీ "ఈ నాబొట్ట కరెంటు... అప్పుడే సచ్చిందా... ఇట్ల కరెంటొస్తే ఇంగెందరు సస్తారో" అంది.

ఆమె చుట్టూ ఎవరూ లేరు. పచ్చగా ఉండే తోటమధ్యలో ఒక్కటే నిలబడుకుని ఉంది. ఐదడుగులా రెండంగుళాల ఎత్తుంటుంది. మాసిన ఎర్రచీర కట్టుకుని, నల్లటి రవిక తొడుక్కుంది. నల్లటి ముఖానికి పచ్చగా పసుపు వుంది. నుదుటన రూపాయిబిళ్ళ కన్నా ఇంకాస్త పెద్దగా కుంకుమ బొట్టు. తలలో ఆరేడు మూరల పూలు.. రెండు చేతులకు మోచేతులదాకా రంగురంగుల గాజులు.. ఆమె ముఖంలో దిగులు. దిగులును మించిన తెగింపు.. కళ్ళలో ఆవేదన.. అంతకన్నా ఎక్కువగా కోపమూ..

ఎండిపోయిన కర్రలా ఉన్న ఆమె శరీరం సన్నగా వణుకుతా ఉంది. వాతావరణం చలిగాలేదు. తొమ్మిది గంటలకే సూర్యుడు ప్రతాపం చూపిస్తున్నాడు.

పారను చేతిలో పట్టుకునే మోటారు వద్దకు వచ్చిందామె. చుట్టూ ఒకసారి పరిశీలనగా చూసింది. ఎక్కడా మోటారు చప్పుడు లేదు.

"ఈ ముండ కరెంటు ఎప్పుడొస్తాదో ఏమో.." అంది.

ఆమె కదిలిన ప్రతిసారి చేతుల్లో గాజులు గలగలమంటున్నాయి.

## 1

ముప్పై ఏండ్లనాటిమాట..

నాయన కపిల తోలుతున్నాడు. బాన పైకొచ్చిన ప్రతిసారీ తొండంలోంచి నీళ్ళు కాలవలో గలగలమని చప్పుడు చేస్తూ దుంకుతున్నాయి.. బాయి దరి లోపల ఒకవైపు జీవిచెట్టు.. దాని సన్నటి కొమ్మలకు జీనివాయిలు అల్లిన గూళ్ళు.. అవి గాలి వీచినప్పుడు అటూ ఇటూ కదులుతున్నాయి. ఉయ్యాలలాంటి తనగూటిలో కూర్చుని మగ గువ్వ ఒకటి శ్రద్ధగా పరిసరాలను చూస్తా వుంది. ఇంకో చోట రెండు గువ్వలు ముచ్చట్లాడుకుంటున్నాయి.

కపిలలాగే ఎద్దులు బలంగా ఉన్నాయి. కపిల మోకుమీద కూర్చున్న నాయన ఎద్దులతో పోటీపడే మాదిరిగా దృఢంగా వున్నాడు. తలకు తుండుగుడ్డ చుట్టుకోనున్నాడు. చుంచె బీడీ చెక్కన పెట్టాడు. మోకాళ్ళదాకా పొడవున్న ఆకుపచ్చ నిక్కరు వేసుకున్నాడు. గాధా గుడ్డతో కుట్టిన బనియన్..

సూర్యుడు కొండల చాటు నుంచి ఎగబాకుతున్నాడు. చెట్లనీడలు చాలాదూరం పడుతున్నాయి. రాత్రి కురిసిన మంచు కొంచెంకొంచెం ఆవిరై పోతా వుంది.

ఆరడుగుల పొడవున్న నాయన కపిల తోలడం ఆపాడు.

తలకు చుట్టుకోనుండే తుండుగుడ్డ తీసి ముఖానికి పట్టిన చెమట తుడుచుకున్నాడు. మీసాలను దీడినాడు. బనియను జేబులోనించీ బీడీకట్ట తీశాడు. బీడీ వెలిగించాడు. నోటినిండుకు పొగ లాగాడు. ముక్కు రంధ్రాల్లోంచి పొగ ఊదన బుర్రలోంచి వచ్చినట్టుగా వస్తాంది. పొలాన్ని పరిశీలనగా చూశాడు.

ఎకరా నేలలో వరిపైరు.. జిలకర మసూర వడ్లు.. నిండు పొట్టతో వుంది. రెండు కయ్యలకు అనుకుని రెండెకరాల నేలలో సజ్జ.. కంకుల్లో ఇంకా గింజ ఏర్పడలా..

నాయనొకసారి పల్లెదారి వైపు చూశాడు.

వెలుగులు రువ్వుతూ ఐదేళ్ళ కూతురు ఆనందాన్ని మూట గట్టుకుని వస్తా వుంది.

నాయన తిరిగి కపిల తోలడం మొదలు పెట్టాడు.

చెంగుచెంగున లేగ దూడలా.., పడతానేమో అనే భయం లేకుండా.., గలగలమని చప్పుడు చేస్తా పరుగున వచ్చింది కూతురు.

చెంపలకు చేరడేసి కళ్ళు.. తీర్చి దిద్దినట్టున్న ముక్కు.. నల్లటి రంగు.. నిపుణుడైన శిల్పి చేతిలోంచి రూపు దిద్దుకున్న అందమైన బొమ్మలా వుంది కూతురు.

నిద్ర లేవగానే బాయి వద్దకు రావడం అలవాటు..నాన్న తోలే కపిల చూడడం ఇష్టం.. బానలోంచి గభిల్లుమని దుంకే నీళ్ళు, గలగలమని చప్పుడు చేస్తా కాలవలో పోవడం చాలా ఇష్టం. పరుగున వచ్చిన కూతురు కాలవ నీటిలో ఎగిరి దుంకింది.. దూకుతూనే వుంది. దూకిన ప్రతిసారి గలగలమనే చప్పుడు.

కాలవ నీటిలో దూకద్దని నాయన కూతురిని వారించలేదు.. కూతురు చేసే ప్రతిపనీ నాయనకు ఇష్టం.. శుక్రవారం పుట్టింది.. లక్ష్మీదేవి అని వాళ్ళ నమ్మకం.. ఆ నమ్మకాన్ని నిజం చేస్తూ కూతురు పుట్టినప్పటి నుంచీ పంటలు బాగా పండుతున్నాయి. పంటలకు పెద్దగా చీడపీడల బెడద లేదు. నాలుగు రూకలు చేతిలో కదులుతున్నాయి. పొలాలు ఇల్లూ కళకళలాడుతున్నాయి. వచ్చిపోయే మనుషులతో ఇల్లు గలగలమంటూ సందడిగా వుంది.

కాలవ నీటిలో ఈ చివరి నుంచి ఆ చివరకూ.. ఆ చివరనుంచీ ఈ చివరకూ పరుగులు తీస్తా వుంది కూతురు.

కయ్యలో నీళ్ళు చూసి రమ్మన్నాడు నాయన. కూతురు కాలవలో గలగలమని చప్పుడు వచ్చేలా కాళ్ళు ఎత్తెత్తి వేస్తా వెళ్ళింది. కయ్య గెనింపైన నడుచుకుంటా ఆ చివరకు పోయింది. కిందకు వంగింది. చేతి వేళ్ళను కయ్యలో నిలువుగా పెట్టింది. అరచేతి మధ్యలోకి వచ్చాయి నీళ్ళు.

వచ్చి నాయనకు చెప్పింది.

నాయన కపిల తోలడం ఆపేశాడు. ఎద్దుల అగ్రులపైన కాడిమాను అలాగే వుంచేశాడు. కాడిమానుపైన మోకును వేశాడు. తను కపిలబాన వీపు పైన వేసుకున్నాడు. ఎద్దుల పగ్గాలు చేతిలో పట్టుకుని నాయనతో గలగలా మాట్లాడతా ముందు నడస్తా వుంది కూతురు.

ఇద్దరూ ఇళ్ళు చేరుకున్నారు.

పొయ్యిమీద అన్నం.. గంజి వంచి అవుటిల్లే దానికి పెట్టింది అమ్మ.. మూకుడు సందుల్లోంచి సన్నగా ఆవిరి పైకి వస్తా వుంది. ఇంటి పెరట్లో రోలు దగ్గర చెనిగ్గింజల ఊరిమిండి నూరతా వుంది అమ్మ.

నాయన కపిల తోలేదానికి లేసినప్పుడే అమ్మ కూడా లేచేసింది. ఇళ్ళంతా ఊడ్చేసింది. ఎద్దుల మిద్దెలో శుభ్రం చేసింది. పేడ తీసుకుపోయి నీళ్ళలో వేసింది. ఇంటి ముందు పేడతో అలికింది. ముగ్గుపిండితో ముగ్గేసింది. నీళ్ళ బాయికి పోయి ఇత్తలి బిందెతో నీళ్ళు తెచ్చింది. పెరట్లో తొట్టికి పోసింది. పూలమొక్కలకు పోసింది.. నీళ్ళబానలో పోసింది. బియ్యం కడిగి పొయ్యి మీద పెట్టింది. పెరుగు చిలకడం మొదలు పెట్టింది. మట్టి పాత్రలో కవ్వం చేసే గలగలమనే చప్పుడు, అమ్మ చేతిగాజుల చప్పుడు. కూతురుకు మెలకువచ్చింది.

అమ్మ చిలకడం చూస్తా వుంది కూతురు. తను కూడా చిలకడం కోసం ప్రయత్నించి ఒకసారి కిందకు తోసేసింది పెరుగు సట్టిని. అప్పట్నించి అమ్మ తనచేతికి కవ్వం ఇవ్వటం లేదు. అమ్మతో మాట్లాడ్డం మొదలు పెట్టింది కూతురు.. ఐదేళ్ళ ఆ కూతురికి ఎన్నెన్నో సందేహాలు.. గలగలా మాట్లాడుతూనే వుంటుంది. ఇంకా బడికి పోవడం లేదు. కూతురే కాదు.., కూతురు వయసున్న పిల్లలంతా బడికి పోవడం లేదు. ఐదేండ్లు నిండడానికి ఇంకా నాలుగు నెలలుంది. ఐదేండ్లు నిండాక బడికి పోతుంది.

అమ్మ దగ్గరికి పరుగున వచ్చింది కూతురు.. ఎడమచేత్తో రుబ్బురాయి అచ్చును పట్టుకుని, కుడిచేతితో ఊరిమిండిని తోస్తా నూరతాండే అమ్మదగ్గర కూర్చుంది.. గలగలమని చప్పుడు చేస్తున్న అమ్మ చేతుల గాజులనే కాసేపు చూసింది.

తనను చూసినా చూడనట్టుగానే ఉంది అమ్మ. కూతురు మాటలు మొదలు పెట్టింది. అమ్మ ముఖంలో నవ్వు.. కూతురు కూడా రుబ్బు రాయి అచ్చును పట్టుకుని రుబ్బడం మొదలు పెట్టింది. ఒకరి ముఖంలోకి ఒకరు చూసుకున్నారు. ఇద్దరూ కిలకిలా నవ్వారు.

అమ్మ మెడలోని 'కంటి' సూర్యకిరణాలు పడి తళతళా మెరుస్తా వుంది.

వంటపని పూర్తయింది. ముగ్గురూ అన్నం తినేశారు. కొంచెం అన్నం ఇంట్లో పెట్టి మిగిలింది కట్టుకునింది అమ్మ. అన్నం, నీళ్ళ పాత్ర గంపలో పెట్టుకునింది.. ఎద్దులను వీధిలోకి తోలింది. వాటి పగ్గాలు కూతురు చేతిలోకి తీసుకునింది. ఎద్దులను తోలుకుని అమ్మా కూతురు చేను వైపు నడక మొదలు పెట్టారు. ఇరవై నిముషాల్లో చేనువద్దకు చేరుకున్నారు.

చేను పక్కనే చిన్నగుట్ట వుంది. కూతురు గుట్ట ఎక్కి రాళ్ళమీద అటూ ఇటూ దూకుతా వుంది. పడతావని అమ్మ చెప్పినా వినిపించుకోవడం లేదు.

ఆకాశం మబ్బేసుకుంది. కాసేపట్లోనే వాన మొదలైంది. చేను పక్కనే ఉండే పెద్ద వేపచెట్టు మొదలు వద్దకు చేరుకున్నారు అమ్మా కూతురు. గలగలమనే వాన చప్పుడు. తడవకుండా అమ్మకొంగు చాటున నిల్చున్న కూతురు ఒక్కుదుటున వానలోకి పరుగులు తీసింది. చేతులు రెండూ చాపుకుని ఆకాశంవేపు చూస్తా గిర్రున తిరగడం మొదలు పెట్టింది.

గట్టులేని కూతురు సంతోషాన్ని అమ్మ అపురూపంగా చూస్తా ఉంది.

ఐఐఐ

డుర్రుమంటా  మోటారు చప్పుడు చేస్తా ఉంది. పైపులోంచి నీళ్ళు గలగలమని దుంకుతున్నాయి.

"ఏమ్మే..నువొచ్చినావే.. ఇట్ల రావచ్చా.. పదకొండో దినందాకా ఇంట్లోంచి బయటకు రాకూడదు. ఒగేళ వచ్చినా ఒంటిగా రాగూడదు. తెలీదా?"

వంగి ఎండుతున్న చెరుకు మోసులకు నీళ్ళు కడుతున్న నల్లటి, ఎండిన కర్రలాంటి ఆమె నిటారుగా నిలబడింది. ఆ మాటలు అన్నామె వైపు కోపంగా చూసింది.

"ఇట్లా ఇద్దూరం నేనేడా చూళ్ళేదమ్మా.." అంటా పోయిందామె.

తిరిగి తోటకు నీళ్ళు కట్టడంలో మునిగిపోయింది.

పారను పట్టుకోనుండే చేతులు కంపిస్తున్నాయి. చేతులే కాదు, నిలువెల్లా వణికిపోతోంది. శరీరమే కాదు.., మనసు కూడా.. దుఃఖం.., బాధ.., దేనిపైనో, మంటలు చల్లార్చుకోవడానికి తనకు తనే ఊసులు చెప్పుకుంటా ఉంది.., మౌనంగా..

**2**

పదేండ్ల కిందటి మాట..

పెండ్లిచూపులు. నల్లగా నేరేడు పండులా నిగనిగలాడతా ఉండే అమ్మాయిని అదే పనిగా చూస్తున్నారు అబ్బాయి తరపు వాళ్ళు. అమ్మాయి గుణగణాల గురించి చెప్పేమాటలు వింటున్నారు.

లేత ఆకుపచ్చరంగు పట్టుచీర కట్టుకుంది. తలలో కనకాంబరాలు పెట్టుకుంది. చాపమీద కూర్చుని ఉంది అమ్మాయి. వోరకంటితో అబ్బాయిని అప్పుడప్పుడూ చూస్తాఉంది.

అందరూ గలగలమని మాట్లాడుకుంటున్నారు. ఒక్కడే కొడుకు. నాన్న కాలంచేశాడు. ఆరెకరాల చేను.. నాలుగెకరాల మడి. రెండుబావులు. నాలుగు బోరుబావులు.

అమ్మాయి అబ్బాయి చూపుల మధ్య పూలు పూచాయి.

నెలరోజుల్లో పెళ్ళైపోయింది.

అత్తగారింట అడుగుపెట్టింది ఆ అమ్మాయి. వంటా వార్పుల్లో నేర్పరి. పొలం పనుల్లో తనకు తెలీనివి లేవు. కాళ్ళగజ్జెలు ఘల్లు ఘల్లుమని చప్పుడు చేస్తా వుంటే.., గలగల మాట్లాడతా ఇల్లంతా తిరుగాడే భార్యను చూస్తే అతనికి ఎంత సంతోషమో. పనులన్నీ వదిలి భార్యనే చూస్తా వుందామనిపించేది. భార్యకోసం ఏమైనా చేయాలనిపించేది.

అతను ఐదడుగులా ఎనిమిదంగుళాల ఎత్తున్నాడు. చామనచాయ. చాలాదృఢమైన శరీరం. బండల్ని లాగే ఒంగోలు గిత్తలా ఉన్నాడు. కొండల్ని సైతం పిండి చేయగలననే ధీమా అతని చేతల్లో మాటల్లో కనిపిస్తా వుంటుంది. గలగలా దాపరికం లేకుండా మాట్లాడే భర్తంటే ఆ అమ్మాయికి చాలా ఇష్టం. ఊపిరాడని అతని కౌగిలిలో నలిగిపోవడమంటే అంతకన్నా ఇష్టం.

ఇంటిదగ్గర ఏపనికీ అడ్డుచెప్పని వయసుడిగిన అత్త.

ఇద్దరిదే ఇష్టారాజ్యం.

భార్యభర్త కలిసే పొలంవద్దకు పోయేవాళ్ళు.

డుర్రుమనే మోటారు చప్పుడునూ, గలగలమని తొట్టిలో దుంకే నీళ్ళచప్పుడునూ

వినడం ఆ అమ్మాయికి చాలా ఇష్టం. ఆ నీళ్ళచప్పుడు వింటూ గతంలోకి జారిపోయేది. తన అమ్మానాన్న దగ్గరకు వెళ్ళిపోయేది. నాన్న కపిలసేద్యం గుర్తుకు చేసుకునేది. అప్పటి రోజులు ఎంతబాగున్నాయో కదా అనుకునేది. మాయదారి కరెంటొచ్చినాంక మోటార్లొచ్చినాంక. ముందు.గా ఎద్దలమిద్దె బోసిపోవడం కళ్ళముందు మెదిలి బాధపడేది. ఎండిపోయిన తమబావులు.. బోర్లువేసి అయిన అప్పులు.. తనపెళ్ళి చేయడానికి అమ్మానాయన పడ్డబాధలు.. గుర్తొచ్చి కళ్లనీళ్లు పెట్టుకునేది.

భార్యను ఆవిధంగా చూశాడంటే భర్త విలవిలలాడిపోయేవాడు. తనవలన ఏంపొరపాటు జరిగిందో అని కంగారు పడేవాడు. తెలీక తప్పుచేసుంటే మన్నించమనేవాడు. గలగలమంటూ మాట్లాడకుండా బాధగా వుంటే చూడలేననేవాడు. కళ్ళనీళ్లు పెట్టుకునేవాడు.

భర్త బాధను చూసి ఆ అమ్మాయి పుట్టింటి ఆలోచనలు ఆగిపోయేవి. కళ్ళనీళ్ళు తుడుచుకుని కిలకిలా నవ్వేది.

అలాంటివి రెండుమూడు సందర్భాలు అయ్యాక ఇంగెప్పుడన్నా నువ్వు ఏడ్చినావంటే నామీద ఒట్టే అన్నాడు ఒకసారి. నిజంగానే ఆరోజునుంచీ ఆ అమ్మాయి పుట్టింటి వారిని తలుచుకుని బాధపడ్డం మానేసింది. ఏదన్నా అవసరమైతే భర్తే ముందుండి అత్తగారికి సాయం చేసేవాడు.

గలగలా మాటలు...

ఒకరికోసమే ఒకరు పుట్టినట్టుగా వుండేవాళ్ళు.

పచ్చని పంటలు.. పసుపుపచ్చని ధాన్యం ఇంటినిండా.. భర్త ప్రేమ హృదయంనిండా.. పొలంలో తమకష్టం భార్య వంటిమీదకు బంగారంరూపంలో వచ్చి చేరింది.

భార్య చేతులకు నాలుగు గాజులున్నాయి. ఆ గాజులు గలగలమంటే భర్తకు చాలా ఇష్టం.

కరెంటు పోవడంతో పారను పక్కన పెట్టి, నేలమీద కూర్చుని, మోకాళ్ళమీద తల పెట్టి, రెండుచేతులను కాళ్ళచుట్టూ చుట్టుకుని ఉందామె. కళ్ళలోంచి నీళ్ళకుండకు చిల్లు పడ్డట్టుగా కారుతున్నాయి. "అమ్మా.." అనే పిలుపుతో ఉలికిపాటుగా తలెత్తి చూసింది.

ఎదురుగా పదేళ్ళలోపు వయసున్న ఇద్దరు కూతుళ్ళు. వారిని చూడగానే ఆమెలో ఏడుపు మరింతగా పెరిగింది.

కళ్ళకు మసకగా కనిపిస్తున్న కూతుళ్ళవేపు చేతులు సాచింది. పిల్లలిద్దరూ తల్లికి చెరొకపక్కన ఒదిగిపోయారు. ఇద్దరినీ తనగుండెలకేసి అదుముకుందామె. ఆమె హృదయం దుఃఖంతో ఎగిసెగిసి పడుతోంది.

ఇలా బాధపడితే బిడ్డలేంకావాల? అని తనకు తనే ధైర్యం చెప్పుకుంది. ఏడుపును ఆపుకుంది. పైటకొంగుతో కళ్ళు తుడుచుకుని, తెచ్చి పెట్టుకున్న గాంభీర్యంతో "బడి లేదా" అడిగింది పిల్లలను.

"లేదమ్మా. ఈ పొద్దు మా సార్ రాలేదు" చెప్పారు పిల్లలు కళ్ళనీళ్ళు తుడుచుకుంటా.

"వోళ్ళ కయ్యకాడ మిషన్ పోతాండాది. కరెంటొచ్చింది. పదకొండు గంటలకంతా కరెంటు పోతాది. మిషనెయ్" అంటా లేచింది ఆమె, పారను చేతికి తీసుకుంటా.

చిన్నమ్మాయి పరుగున వెళ్ళి బటన్ నొక్కింది. పైపులోనించీ గలగలమంటూ నీళ్ళు దుంకడం మొదలుపెట్టాయి.

"నేను కడతా నీళ్ళు. పార ఈమ్మా" పెద్దమ్మాయి అడిగింది.

'నేనుండాను కదా. కడతాలే..' అనలేదామె.

## 3

నెలకిందట..

ఎండిపోయిన ఎకరం వరిపైరులో జెర్సీ ఆవులు మేస్తున్నాయి. అవి పైరును కొరుకుతా ఉంటే పరపరామని చప్పుడు వస్తావుంది. అవి కూడా బక్కచిక్కిపోయాయి. గెనం నీడలో కూర్చుని ఆవులనే చూస్తావుంది ఆమె. పండకముందే నేలరాలి వొరిటిపోయిన నేరేడు పండులా ఉందామె.

పక్కనే భర్త కూడా వున్నాడు. కబేళాకు పోయే ఎద్దులా వున్నాడు.

అప్పటికే ఇరవై నాలుగు బోర్లు వేశారు. నీళ్ళు పడలేదు. నేలకు తూట్లు పడ్డట్టుగానే మనసంతా గాయాలు పడ్డట్టుగా విలవిల్లాడుతున్నాడు భర్త. గలగలమనే మాటల్లేవు.

దిగులొద్దు అంటుంది భార్య. అందరికీ అయ్యిందే మనకూ అవుతుంది అంటుంది.

బ్యాంకులో అప్పేంచేసేది అంటాడు. సొసైటీ వోళ్ళు జీపేసుకుని వస్తే ఎక్కడ దాక్కునేది అంటాడు. నాలుగు లక్షల అప్పుంది. దాని వడ్డీ.. వోళ్ళు అడగతావుండారు..

ఆకాశంలో మబ్బులు చూసి వాన వస్తాదిలే.. బతుకులు బాగుపడతాయి అని నమ్ముకుని చెనిగ్గింజలు ఏస్తిమి.. వాన మోసం చేసె..!

నీళ్ళను నమ్ముకుని బోర్లేస్తిమి.. నీళ్ళూ మోసం చేసె..!

నేలను నమ్ముకుని చేతికొచ్చిన పంటను అమ్మబోతే అడివే కదా.. కూలిగూడా గిట్టుబాటు కాలేదే..!

ఇట్లే అయితే ఎట్ల బతికేది..?

ఈ మధ్య ఇలాంటి మాటలు అంటున్నాడు భర్త.

నైరాశ్యంతో మాట్లాడే భర్తను చూస్తే ఆమెకు చాలా దిగులేసేది, బాధేసేది.. కళ్ళలో నీళ్ళు తిరిగేవి. నువ్వు ఏడిస్తే నేను సచ్చినంత ఒట్టే అని భర్త పెళ్ళైన కొత్తల్లో అన్న మాటలు గుర్తొచ్చి దుఃఖాన్ని దిగమింగుకునేది. భర్తకు ధైర్యం చెప్పేది.

రత్నాల్లాంటి ఇద్దరు పిల్లలు, ఒకరు మూడు, ఒకరు ఐదు తరగతులు చదువుతున్నారు. వోళ్ళను చూసైనా మనం ధైర్యంగా బతకాల అనేది భర్తతో. అవునన్నట్టుగా తలూపేవాడు అతను. ఏవో ఆలోచిస్తూ వుండిపోయేవాడు..

గలగలమని వినసొంపుగా చప్పుడు చేసే బంగారుగాజులను అమ్మేశారు. గాజులొక్కటే కాదు.. ఇంట్లోని, ఆమె ఒంటిపైన బంగారమంతా కొంత బ్యాంకుల్లో వుంటే కొంత అమ్మేశారు. ఆమె మెడలోని మంగళసూత్రం మాత్రం వుంది. పొలంకూడా తనఖాలో వుంది.

ఎరువుల్లో కల్తీ..

విత్తనాల్లో కల్తీ..

కొనే విత్తనాల ధర ఆకాశంలో..

పండించిన కూరగాయల ధరలు పాతాళంలో..

వరి పండిస్తామంటే కరెంటివ్వలేము.. ఆరుతడి పంటలేసుకోండి అని పాలకులు హుకుం జారీ చేసిరి.

ఆరుతడి పంటలేసి కూరగాయలు పండిస్తే మార్కెట్ మోసంతో రేట్లు లేవు. టమోటాల్లాంటివి మండీలవద్ద రోడ్డుపైన పారబోయాల్సి వచ్చింది. తోటల్లోనే కాయలు వదిలేశారు. నిల్వ వుంచి అమ్ముకోను అవేమీ వడ్లు కాదు కదా?

అడుగు ఎలా ముందుకు వేయాలో తెలీడం లేదు అతనికి. తనను నీళ్లల్లో ముంచేస్తున్నట్టు విలవిల్లాడిపోతున్నాడు. ఒకగదిలో బంధించి గాలి మెల్లమెల్లగా తీసేస్తున్నట్టు అంతకంతకూ జీవించే ధైర్యాన్ని కోల్పోతున్నాడు.

"కరెంటు ఇంగ రేత్రికి తొమ్మిది గంటలకు వస్తాది" అందామె.

డుర్ర్‌మనే మోటారు చప్పుడు ఆగిపోయింది. గలగలమనే నీళ్ళ చప్పుడూ ఆగిపోయింది.

చెరుకుతోట పచ్చగా వుంది. వాటికి తగినంత ఎరువులు వేయక పోవడంతో పీలగా వున్నాయి మొక్కలు. తోటకు ఆనుకునే గెనంవారంటీ కానగ చెట్లు. వాటిని చూడగానే ఆమెకు కళ్ళల్లో నీళ్ళుతిరిగాయి. పిల్లలను చూడగానే నీళ్ళు కనురెప్పలు దాటి బయటకు రాలేదు.

పిల్లలను తీసుకుని పల్లెవైపు నడక మొదలు పెట్టింది.

ఆమె చేతులు కదిలిన ప్రతిసారీ గాజులు గలగలమంటున్నాయి. మామూలుగా గాజులు గలగలమంటే ఆమెకు ఇష్టం. అయితే ఇప్పుడా గాజుల గలగలలు వినలేకుండా వుంది. ఇబ్బందిగానూ, బాధగానూ వుంది.

పిల్లలిద్దరూ ఆమె వెనకే మౌనంగా వస్తున్నారు.

దారిలో తమ పల్లెవాళ్ళు ఇద్దరు ఎదురు పడ్డారు. తమను దాటి పోతూ "చూడమ్మా.. ఈ ఆడది ఎంతకు బరి తెగించిందో.. ఎవురన్నా నీళ్ళొదలకముందే తోటకు నీళ్లు కట్టేదానికి పోతారా" అంటున్నారు.

వాళ్ళమాటలు విన్నా విననట్టుగానే వుంది ఆమె. అయితే పిల్లలు అలా మౌనంగా వుండలేకపోయారు. "నీళ్ళొదిలేదంటే ఏందమ్మా" అడిగారు అమ్మను.

"కట్ట తెంపేసి చెర్లో నీళ్ళన్నీ వదిలేసేది."

"అట్ల చేస్తే నీళ్లల్లో మొక్కలన్నీ మునిగిపోవా"

"మునిగిపోతాయి.. వాటిల్లో శక్తి వుండే మొక్కలు మళ్లా మెల్లగా పైకి లేస్తాయి.. బతుక్కుంటాయి.."

## 4

మూడ్రోజుల కిందట..

పొద్దునే ఆరుగంటలు.. మసకమసకగా వుంది. మంచు వుంది. భర్త కోసం ఎదురు చూస్తా వుందామె. కరెంటు రాత్రి పూట పన్నెండు గంటలనుంచీ నాలుగు గంటలవరకూ

వుంటాదంతే. కరెంటు పోతానే ఇంటికొచ్చే భర్త రెండుగంటలైనా రాకపోయేప్పటికి ఆమెకు కంగారుగా వుంది. ఆమె మనసు ఎందుకో కీడు శంకిస్తా వుంది. జెర్సీ ఆవుల దగ్గర పాలు పిండి క్యారేజీలో పోసింది. డిపోలో పోసేసి రమ్మని పిల్లలకు చెప్పి పొలంవద్దకు బయలుదేరింది. ఎందుకో ఆమెకు అడుగులు తడబడుతున్నాయి.

పొలం వద్ద.. గట్టు పైన వుండే కానగ చెట్టుకు.. భర్త శవమై వేలాడుతున్నాడు.. అతడిని చూడగానే ఆమె నవనాడులూ కృంగిపోయాయి. తనుకూడా శవంవద్ద పెద్ద కేక వేసి స్పృహ కోల్పోయింది. ఎప్పటికో తెలివిలోకి వచ్చింది. చుట్టుపక్కల వాళ్ళు వచ్చారు. పోలీసోళ్ళు వచ్చారు.. రెవెన్యూ వాళ్ళు వచ్చారు.. ఎవరెవరో అధికారులు వచ్చారు. ధైర్యం చెప్పామని వారు అనుకుంటున్నారు. అవేవీ ఆమె మనసులోకి కాదుకదా.., కనీసం చెవుల్లోకి కూడా పోవడం లేదు.

భర్త గలగలమనే మాటలే వినిపిస్తున్నాయి. భర్త నవ్వుముఖమే కళ్ళెదురుగా కనిపిస్తా వుంది. నువ్వు ఏడిస్తే నేను సచ్చినంత ఒట్టే అన్న భర్త మాటలు గుర్తొస్తున్నాయి. ఏడ్వకుండా వుండటానికి ఎంతగానో ప్రయత్నిస్తా వుంది.. కానీ సాధ్యం కావడం లేదు. ఆమెను చుట్టుకుపోయారు పిల్లలిద్దరూ..

ఏడాదిక్రితం అత్త చనిపోయింది. ఇప్పుడు భర్త బలవన్మరణం..

ఎన్నెన్ని ఊసులు.. ఎన్నెన్ని బాసలు..

మనరూపం పంచుకుని, మనరక్తం పంచుకుని పుట్టిన బిడ్డలు.. వాళ్ళ భవిష్యత్తు.. ఇవేవీ నీకు గుర్తు రాలేదా..? ఇలా సుఖంగా వెళ్ళిపోవడానికి నీకు మనసెలా వచ్చింది. మేమంతా ఎట్ల బతకాల? నేనేదన్నా చిన్న పని చేస్తానన్నా.. నేనుండాను కదా, నువ్వెందుకులే అనేవాడివే.. ఇప్పుడు మా పన్లన్నీ ఎవురు చేసి పెడతారు. సేద్యం ఎవరు చేస్తారు.. సేద్యం చేయకుంటే బతికేది ఎట్ల..? నమ్ముకున్నోడే మోసం చేసి తనదోవ తను చూసుకున్నేంక పొలం నమ్ముకుని బతగ్గలమా? చేతుల్లో శక్తి వుండి, గుండెల్లో ధైర్యముండీ బతకలేకపోయాడే.. తనెట్ల నెట్టుకొస్తాది దీన్ని..? రకరకాల ఆలోచనలు ఆమె మనసులో మెదులుతున్నాయి.

బంధువులంతా వచ్చారు. చేయాల్సిన తంతు చేసేశారు. పదకొండోరోజు కర్మక్రియలు చేయాలని నిర్ణయించారు.

అప్పుల వాళ్ళు వచ్చారు.

తనఖా పొలం తమకే ఇచ్చేయమని కొందరు, మిగిలిన పొలం అమ్మేసి తమ బాకీలు తీర్చమని మరికొందరు.., పొలం వద్దు, ప్రభుత్వం ఇచ్చే నష్ట పరిహారం తమకే ఇవ్వమనే ఉదారవాదులు కొందరు..

ఎవరికీ సమాధానం చెప్పలేదామె.. .

అసలామె మనసులో ఏముందోకూడా ఎవ్వరికీ తెలీదు.

బంధువులే కలగజేసుకున్నారు. అప్పులోల్లకు సర్ది చెప్పి పంపించారు. కర్మక్రియలు జరిగేదాకా ఇళ్ళు కదలద్దన్నారు.

అంత బాధలో కూడా చెరుకుమోసులు మనసులో మెదిలాయి. రాత్రి పూట, వేళకాని వేళలో వచ్చే కరెంటు గుర్తొచ్చింది. తడి తగలకపోతే మోసులు ఎండిపోతాయి. 'పెట్టిన పైరును చంపుకునేవాడు రైతే కాదు' అనేవాడు భర్త. రక్తం ధారపోసయినా పైరును బతికించుకోవాలనేవాడు.. అందుకే ఇరవై ఐదో బోరు వేశాడు.. తమకు పుట్టిన మోసులూ..?!

"ఏంమా బాలచ్చిమీ.. దినాలయిందాకా ఇంటికాన్నే వున్నింటేనేమి?" దోవలో ఎదురొచ్చిన నాయన అడిగాడు.

తాతను చూడగానే పిల్లలిద్దరూ ఆయన వద్దకు పోయి చెరొక చేతిని పట్టుకున్నారు. అందరూ కలిసి పల్లెవైపు నడుస్తున్నారు. ఆమె మౌనంగా వుంది.

నాయన బాగా ముసలివాడైపోయాడు. గూని వచ్చేసింది. గానుగలోంచి వచ్చిన చెరుకుపిప్పిలా వున్నాడతను. "ఇబ్బుడే ఇంటికొచ్చినా.. బీగం ఏసిన్నారు.. పక్కింట్లో వోళ్ళు చెప్పిరి. చెరుకుతోటకు నీళ్ళు కట్టేదానికి పోయిందాది అని. ఎమ్మట్నే ఇట్ల ఎలబారొస్తి" వివరించాడతను.

కాళ్ళగజ్జెలతో గలగలమని చప్పుడు చేస్తా లేగదూడలా దుంకే కూతురు..

గలగలా మాట్లాడుతూ కలివిడిగా వుండే కూతురు.. మౌనంగా వుంది.

"ఇంగ వారం దినాలే కదామ్మా.. ఇంటికాన్నే వుండు." అన్నాడు తండ్రి.

"ఎట్లుండమంటావు నాయనా ఇంటికాడ. ఎవరుండారు చేసేదానికి.. ఆయనేమో సుఖంగా పాయ.. ఇద్దరు నేదరు బిడ్డలుండారు.. వోళ్ళను ఆయనమాదిరిగా గాలికి వదిలేసి నేనూ వురేసుకుని చావలేను గదా.. మీకేం మొగోళ్ళకు ఎన్నయినా చెప్తారు. ఏచిన్న ఇబ్బంది వచ్చినా వదిలేసి పోతారు. మాకట్ల కాదు కదా.. తొమ్మిది నెలలు మోసి, సమచ్చరం రోజులు పాలిచ్చి పెంచినా.. నారక్తం నాయనా బిడ్డలు.. నేను సాస్త్రాలు సాంగేలు అని ఇంటికాన్నే వుంటే చెరుకుతోట ఎండిపోతాది. మళ్ళ నీళ్ళు కట్టే ప్రయోజనం ఏముండాది? పైరు పచ్చగా వుంటేనే కదా బతుకులు.. మేం బతకాలంటే పైరుతో పోరకలాడాల.. ఇంట్లో వుంటే ఎవురు చూస్తారు. ఎవురన్నా చూసేటిగా వుంటే.., ఆయనెందుకు సచ్చిపోయుంటాడు. ఆయన మాదిరిగా నేనూ సావాలంటే.., నేను ఒక్కదాన్ని కాదే.. ముగ్గుర్ని.. ముగ్గురి పాణాలు ఎట్ల తీసుకునేది..?"

భూలక్ష్మి గలగలా మాట్లాడతా వుంది..

దుఃఖం ఆమె గొంతుకు అడ్డం పడుతున్నా..

బాధ ఆమె గుండెను పిండుతున్నా..

వేదనలోంచే మాటలు గలగలా వస్తున్నాయి. •

చినుకు నాలుగవ వార్షిక ప్రత్యేక సంచిక, ఏప్రిల్ 2009